ఆస్తి పంచాలని తండ్రిపై కత్తితో దాడి 9

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి రైతు బలి
- పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని సిబ్బంది
- గమనించకుండా తాకడంతో రైతు మృతి 9



బీవీఆర్ఐటీలో ఘనంగా వార్షికోత్సవం

నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ వార్షికోత్సవం శనివారం సాయంత్రం అట్టహాసంగా నిర్వహించారు. సినీ గాయకులు కృష్ణప్రసాద్, గాయత్రి తమ పాటలతో ఉర్రుతలూగించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, కన్వీనర్ బంగార్రాజు, కోఆర్డినేటర్లు దశరథరామయ్య, అనుపమ పాల్గొన్నారు.

-నర్సాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి)

ఘనంగా హనుమాన్ జయంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణం జైశ్రీరామ్ నినిదాలతో మార్మోగింది. హనుమాన్ జయంతి ఉత్సవ కమిటీ, బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డిలో వీర హనుమాన్ విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. వైకుంఠపురం ఆలయం నుంచి విగ్రహంతో ఊరేగింపుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా మీదుగా చెరువు కట్ట హనుమాన్ ఆలయం వరకు యాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మందుల నాగరాజు, ద్వారకా రవి, కసిని వాసు, దోమల విజయ్‌కుమార్, శివ, బజరంగ్‌దళ్ నాయకులు తరుణ్, లక్ష్మణ్, అఖిల్, లభిలాష్, బీజేపీ నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, పోచారం రాములు, డా.రాజుగౌడ్, డా.స్వామిగౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, నరేన్ ప్రవీణ్, లవన్, రాజేష్‌గౌడ్, సృజన్, యశ్వంత్, సందీప్, ఆర్ఎస్ఎస్ బాధ్యులు అంబరీష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.




తేజసాయికు స్వీట్ తినిపిస్తున్న తండ్రి శ్రీనివాస్‌రావు

పదకొండేళ్లకు కుటుంబం చెంతకు

తల్లిదండ్రులకు భారం కావొద్దని ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడి ఆచూకీ కనిపెట్టిన పోలీసులు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చదవంటే ఇష్టం.. కానీ తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే... కన్నవారికి భారం కావొద్దని పదకొండేళ్ల క్రితం ఇంజనీరింగ్ చదువుతున్న యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు వెతుకుతూనే ఉన్నా ఆచూకీ తెలియలేదు. వార్ధక్య భారంతో ఓపిక నశించి పది రోజుల క్రితం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఆ యువకుడిని కుటుంబం చెంతకు చేర్చారు. మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కుర్తివాడ గ్రామానికి చెందిన కూనమనేని శ్రీనివాస్‌రావు, శారదల కొడుకు కూనమనేని తేజసాయి 2014లో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలో చేరాడు. తల్లిదండ్రులకు ఆర్థిక భారం ఎక్కువ కావడంతో 2014 సెప్టెంబర్ 7వ తేదీన ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు వెతుకుతూనే ఉన్నారు. పదకొండేళ్లు గడిస్తున్నా సమాచారం తెలియకపోవడంతో తండ్రి శ్రీనివాస్‌రావు ఈ నెల 3న పాపన్నపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ విచారణ చేపట్టారు. ఆధార్ నంబర్ సహాయంతో బ్యాంకు అకౌంట్ వివరాలను సేకరించారు. బ్యాంకు అకౌంట్‌పై ఉన్న అడ్రస్ ఆధారంగా తేజసాయి బెంగళూర్‌లో ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేక బృందం బెంగళూర్‌కు వెళ్లి అతని ఆచూకీ కనుగొని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పదకొండేళ్ల తర్వాత కొడుకు ఇంటికి రావడంతో ఆ తల్లిండ్రులు ఆనందంతో పొంగిపోయారు. తల్లిదండ్రులపై ఆధార పడకుండా జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్న లక్ష్యంతోనే ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తేజసాయి తెలిపారు. బెంగళూర్‌లో ఉంటూ అక్కడే జీవనం సాగించానని, ఆర్థికంగా నిలదొక్కుకున్న తరువాత ఇరువై ఏళ్లకు తిరిగి రావాలని అకున్నట్లు చెప్పారు. కేసును చేధించిన సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలను ఎస్పీ అభినందించారు.

తాగునీటికి తండ్లాట

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో నీటి ఎద్దడి

నారాయణఖేడ్ మండలం షేరి తండాలో వారం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో తండావాసులు వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు.

మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో సుమారు 20వేల జనాభా ఉన్నది. గతంలో రోజుకు రెండుసార్లు తాగునీటిని సరఫరా చేసేవారు. కొద్దిరోజులుగా ఉదయం మాత్రమే నీటిని వదులుతున్నారు. అవి సరిపోక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

- ఏప్రిల్ నెలలోనే కటకట
- అడుగంటుతున్న బోర్లు, బావులు
- మిషన్ భగీరథ నీటి సరఫరాలోనూ సమస్యలు
- వాటర్‌ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న పరిస్థితి
- మంచినీళ్ల కోసం బిందెలతో రోడ్డెక్కుతున్న వైనం

మెదక్ జిల్లా

నెల	భూగర్భ జలాలు (మీటర్లు)
జనవరి	10.94
ఫిబ్రవరి	13.25
మార్చి	15.68

సంగారెడ్డి జిల్లా

నెల	భూగర్భ జలాలు (మీటర్లు)
జనవరి	10.15
ఫిబ్రవరి	12.57
మార్చి	14.79


కంగ్టి సర్దార్‌తండాలో ఎండిన పంచాయతీ బోరు


నాగల్‌గిద్ద మండలం రత్ననాయక్ తండాలో వ్యవసాయ బోరు నుంచి నీటిని మోసుకెళ్తున్న తండావాసులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 12: నారాయణఖేడ్, మనోహరబాద్ ప్రాంతాల్లోనే కాదు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో తీవ్రమైన తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఏప్రిల్ నెల మొదట్లోనే ఈ పరిస్థితి తలెత్తడం ఆందోళన కలిగిస్తున్నది. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి సమస్యలను అధిగమించడం అధికార యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు సవాల్ అని చెప్పక తప్పదు. గత వర్షాకాలం సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. దీంతో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయి. మిషన్ భగీరథ సరఫరాలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పాతాళంలో భూగర్భ జలాలు

సంగారెడ్డి జిల్లాలో గత సంవత్సరం మార్చి నెలలో 12.45 మీటర్ల లోతులో, మే నెలలో 13.2 మీటర్ల లోతులో భూగర్భ జలాలు లభ్యమయ్యాయి. ఈసారి మార్చిలో 14.79 మీటర్లకు పడిపోయాయి. దీంతో ఏప్రిల్ నెలలోనే నీటి కటకట నెలకొన్నది. మెదక్ జిల్లాలోనూ 2024 మార్చిలో 14.76 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా ఈ ఏడాది మార్చిలో 15.68 మీటర్ల లోతుకు పడిపోవడం ఆందోళనను కలిగిస్తున్ననది. గత ఐదేళ్లలో అత్యల్ప స్థాయికి భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. యాసంగిలో తుఫానులు, అకాల వర్షాలు కురిస్తే భూగర్భజలాలు కొంత మెరుగయ్యే అవకాశం ఉంటుంది. లేదంటే వచ్చే రెండునెలల్లో నీటి మట్టాలు మరింత పడిపోయే ప్రమాదముంది. దీంతో, తాగునీటి ఇబ్బందులు తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

సమస్యలు.. నిరసనలు

- శివ్వంపేట మండలం మాల్యతండాలో నీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో గిరిజనులు నిరసన తెలిపారు.
- సంగారెడ్డి పట్టణంలోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తడంతో వాటర్ ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారు.
- కంది మండలంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. చాలా గ్రామాల్లో పంచాయతీ బోర్లు పని చేయడం లేదు. కొయ్య గుండు తండాలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది.
- తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రెండ్రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన విల్లాలు, అపార్ట్‌మెంటర్లకు నీరు సరఫరా కావడం లేదు.
- కంగ్టి మండలం సర్దార్ తండాలో ప్రభుత్వ బోరు పనిచేయడం లేదు.
- నాగల్‌గిద్ద మండలం రత్ననాయక్ తండాలో నీటి సమస్య కారణంగా పొలాల వద్ద ఉన్న బోరు నీళ్లను ఆశ్రయిస్తున్నారు.
- పటాన్‌చెరు మండలం ముత్తంగి, ఇస్నాపూర్‌లో చాలా రోజులుగా మంజీరా నీళ్లు సరఫరా కావడం లేదు. బోర్లలో కలుషితనీరు వస్తున్నది.
- జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటి, కాజిపల్లి గ్రామ పరిధిలో మిషన్ భగీరథ పైపులైను కూడా లేకపోవడంతో కాలనీవాసులే సొంతంగా గుమ్మిలు ఏర్పాటు చేసుకున్నారు.
- ఝరాసంగం మండలం మేదపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ద్విచక్రవాహనాలపై ఇతర ప్రదేశాలను బిందెల ద్వారా నీటిని తీసుకొస్తున్నారు.


శివ్వంపేట మండలం మాల్యతండాలో నీటి కోసం నిరసన(ఫైల్)



బస్తీదవాఖానాకు తాళం వేసి ఉండటంతో వెనుతిరుగుతున్న కలెక్టర్

కలెక్టర్ వచ్చినా దవాఖానాకు తాళం

- విధులకు గైర్హాజరైన ముగ్గురు వైద్య సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు విధులను నిర్లక్ష్యం చేసినా.. చెప్పాపెట్టకుండా విధులకు గైర్హాజరైనా కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని గోల్కొండ వీధిలో బస్తీదవాఖానా-ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి తాళం వేసి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధిలో ఉన్నవారిని విచారించి ఆస్పత్రి పనితీరును అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉండాల్సిన మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్స్, సపోర్టింగ్ స్టాఫ్ విధులకు రాకుండా ఆసుపత్రికి తాళం వేసి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడి, విధులకు హాజరు కాని ముగ్గురిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులను క్రమశిక్షణతో, బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్య శాఖ అధికారులు, సిబ్బంది కృషిచేయాలని సూచించారు. తాను స్వయంగా జిల్లావ్యాప్తంగా ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని వెల్లడించారు.

రోడ్డు విస్తరణ పనులకు మోక్షం

పాత కాంట్రాక్టర్ ఔట్.. కొత్త సంస్థకు పనులు అప్పగింత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జోగిపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సంగుపేట-అన్నాసాగర్ రోడ్డు విస్తరణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఐదు నెలలు.. ఒకే కిలోమీటరు' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి మంత్రి దామోదర్, అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడిన మంత్రి వెంటనే పనులు ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో పనుల్లో తాత్సారం చేస్తున్న కాంట్రాక్టు సంస్థను తప్పించారు. పనులను కొత్త సంస్థకు అప్పగించినట్లు రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఇంజినీర్ కొత్త రవీందర్ గుప్త తెలిపారు. పనుల అప్పగించిన సంస్థ హుటాహుటిన శనివారం రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. మొదటగా కల్వర్టుల విస్తరణ చేపడగామని, అనంతరం రోడ్డు విస్తరణ చేపడతామని సంస్థ బాధ్యులు తెలిపారు. వారం రోజుల్లో తొలిదశ పనులైన సంగుపేట చౌరస్తా-అందోలు వరకు రెండు వైపులా రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేస్తామని తెలిపారు.



ప్రారంభమైన సంగుపేట-అన్నాసాగర్ రోడ్డు విస్తరణ పనులు



పాలిటెక్నిక్‌తో భవితకు బాటలు
- కోర్సు పూర్తిచేయగానే ఉద్యోగాలు
- దరఖాస్తు చేసుకునేందుకు 19 వరకు గడువు 9

హద్దులు లేవు.. కంచె కరువు
- ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు శూన్యం
- మున్సిపాలిటీ స్థలాలపై అక్రమార్కుల కన్ను 9
- ప్రహరీ నిర్మాణం, హద్దురాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్నప్రజలు

'వికాసం' అందక విచారం

- కొన్ని బ్యాంకుల్లోనే దరఖాస్తుల స్వీకరణ
- సర్వీసులు లేవంటూ రుణాలకు ఆమోదం తెలపని బ్యాంకులు
- రుణాలకు దూరమవుతున్న వేలాదిమంది యువత


దౌల్తాబాద్‌లో మీసేవ వద్ద అర్జీదారులు

మెదక్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ముందు చూపు లేని నిబంధనలు.. బ్యాంకుల కొర్రీలు.. అధికారులు నిర్లక్ష్యంతో వేలది మంది యువత రాజీవ్ యువవికాసం పథకానికి దూరమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ పథకం కింది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతీ యువకులకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీతో రూ.3 లక్షల వరకు రుణాలను అందిస్తామని ప్రకటించారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14 వరకు గడువు విధించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అర్హులకు రుణాలు మంజూరు చేయనున్నారు. అయితే, బ్యాంక్ లింకేజీ ద్వారా మాత్రమే రుణం పొందగలుగుతారు. ఈ నిబంధనతో మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండల యువతకు రుణం పొందే అవకాశం లేకుండా పోతోంది. ఈ మండలంలో తెలంగాణ వికాస్ గ్రామీణ బ్యాంక్, డీసీసీబీ బ్యాంకులు మాత్రమే తమ ఖాతాదారులకు సేవలందిస్తున్నాయి. కానీ, దరఖాస్తుదారులు ఎస్‌బీఐ మెదక్, మంబోజిపల్లి డీసీసీబీ బ్యాంకులు లింకేజీ ఇస్తేనే రుణాలను మంజూరు చేయనున్నట్లు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. దీంతో హవేళీఘనపూర్ మండలానికి చెందిన యువకులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే అవకాశం లేకుండా పోతోంది. అంతేకాకుండా దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈ నెల 14తో ముగియనుంది. మూడు రోజులు వరుస సెలవులు రావడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. కలెక్టర్ చొరవ తీసుకుని సెలవు రోజుల్లో కూడా దరఖాస్తులు స్వీకరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు మాత్రం లబ్ధిదారులు మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుని హార్డ్ కాపీని కలెక్టర్ కార్యాలయంలో సమర్పిస్తే సరిపోతుందని పేర్కొంటున్నారు.

ఆన్‌లైన్.. పరేషాన్!

యువ వికాసం దరఖాస్తులకు బ్రేక్!

హత్నూర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. హత్నూర మండలంలో దరఖాస్తుల స్వీకరణ రెండు రోజులుగా సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలు దరఖాస్తులు చేసుకోవాలంటే తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు అవసరం. పత్రాల కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నా అప్రూవల్ వచ్చేసరికి గడువు ముగియనుంది. దీనికితోడు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో అంతరాయం ఏర్పడుతున్నది. దీంతో కేంద్రాల వద్ద ఆశావహులు బారులు తీరుతున్నారు. రాజీవ్ యువవికాసం పథకానికి మండలంలో ఇప్పటివరకు అంతంత మాత్రంగానే దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఆస్తి పంచివ్వాలంటూ తండ్రిపై కత్తితో దాడి


● తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిక

నర్సాపూర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆస్తి పంచి ఇవ్వాలంటూ తండ్రిపై కొడుకు కత్తితో దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామానికి చెందిన వడ్ల దశరత్ కొడుకు నాగరాజు మద్యానికి బానిసై పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. కొంతకాలంగా ఆస్తి పంచివ్వాలని తండ్రితో గొడవపడుతున్నాడు. శనివారం కూడా భూమి పంచి ఇవ్వాలని తండ్రితో గొడవకు దిగాడు. జులాయిగా తిరుగుతున్నందున ఆస్తి రాసివ్వనని తండ్రి తెలుపడంతో ఆగ్రహానికి గురైన నాగరాజు ఇంట్లో నుంచి కత్తి తీసుకుని దాడి చేయడంతో దశరత్ తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని కుటుంబీలు స్థానికుల సహాయంతో మొదట నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.









విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి రైతు బలి

● గాలివానకు పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలు
● మరమ్మతులు చేయాలని కోరినా పట్టించుకోని వైనం
● గమనించకుండా తాకడంతో మృతి

పుల్‌కల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి అన్నదాత బలైన సంఘటన పుల్కల్ మండలం మిన్‌పూర్ గిరిజన తండాలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆ తండాకు చెందిన రమావత్ రమేశ్(32) పొలం మీదుగా ఉన్న విద్యుత్ లైన్ తీగలు రెండు రోజుల క్రితం గాలి దుమారానికి తెగి కింద పడ్డాయి. వీటిని సరి చేయాలంటూ పలువురు రైతులు లైన్‌మన్ దృష్టికి తీసుకువెళ్లగా.. తన ఇంట్లో శుభకార్యం ఉందని, తరువాత సరిచేస్తానంటూ పట్టించుకోలేదు. శుక్రవారం సాయంత్రం తన వరి పొలానికి నీళ్లు పారబెట్టేందుకు వెళ్లిన రమేశ్ తీగలను గమనించకుండా తాకడంతో విద్యుఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు రాత్రి పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా పడి కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ అక్కడికి చేరుకుని శవ పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడికి భార్య లత, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తెగిపడిన విద్యుత్ తీగలను సరిచేయాల్సిన లైన్‌మన్, హెల్పర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే రమేశ్ ప్రాణాలు కోల్పోయాడని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి మండల కాంగ్రెస్ తరఫున రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లన్నగారి దుర్గారెడ్డి తెలిపారు.


ఘటనా స్థలంలో రమేశ్ మృతదేహం

స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పిన బైక్

● గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి

చేగుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండల పరిధిలోని కర్నాల్‌పల్లిలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన కత్తెర బాలయ్య(50) శుక్రవారం దౌల్తాబాద్ మండలం ఇందుర్పురియాకి బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. కర్నాల్‌పల్లి గ్రామంలో భారీగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్‌పై వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి సోదరుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.


బాలయ్య (ఫైల్)

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు..

ఎమ్మెల్యే ఆదేశాలను అధికారులు బేఖాతరు చేయడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయడని పలువురు ఆరోపించారు. చేగుంట నుంచి గజ్వేల్‌కి వెళ్లే రహదారిపై కర్నాల్‌పల్లిలో భారీగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని వారం క్రితం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారి వెంకటేశంను ఆదేశించారు. అయినా తొలగింపునకు చర్యలు తీసుకోలేదు. అధికారులు వెంటనే స్పందించి ఉంటే ప్రమాదం జరిగి ఉండేదే కాదని అభిప్రాయపడుతున్నారు.

ఇద్దరు దొంగలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వర్గల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు దొంగలను గౌరారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గౌరారం గ్రామానికి చెందిన పూదరి శ్రీనివాస్‌గౌడ్‌కు చెందిన కిరాణా దుకాణంలో ఈ నెల 10న చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన వేముల చంద్ర ప్రకాశ్ (27), రాజన్న సిరిసిల్ల జిలా కోనరావుపేటకు చెందిన గాజుల హేమంత్ (19)ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నేరాన్ని ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి రూ.800 నగదు, దొంగతనం సమయంలో షెట్టర్ లేపడానికి ప్రయత్నించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ములుగు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు అలవాటు పడి చేసిన అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని జప్తిసింగాయపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన నీలం శ్రీవర్ధన్‌రెడ్డి(34) చెడు వ్యసనాలకు అలవాటు పడి ఎలాంటి పనులు చేయకుండా ఇంటి వద్దనే ఉంటూ పలువురి వద్ద అప్పులు చేశాడు. వీటిని ఎలా తీర్చాల్లో తెలియక కుటుంబ సభ్యులతో చెబుతూ మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి నీలం బాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


శ్రీవర్ధన్‌రెడ్డి(ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చీకోడ్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గడ్డం పెంటారెడ్డి (72) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 3 న ఇంట్లో మంచంపై నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు మంచంపై నుంచి కింద పడడంతో తలకి గాయమైంది. కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



పాముకాటుతో రైతు మృతి

గజ్వేల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాండవుల శ్రీనివాస్(38) తన వ్యవసాయ పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. శనివారం ఉదయం పంటకు నీళ్లు కడుతున్న సమయంలో నాగుపాము కాటు వేయడంతో వెంటనే కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారికి సమాచారం చేరవేశాడు. దీంతో వారు అతడిని మొదట గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య మమత, ముగ్గురు కుమారులు ఉన్నారు.


శ్రీనివాస్(ఫైల్)

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

తూప్రాన్ ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్ పట్టణ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పట్టణంలోని చెట్లతిమ్మాయిపల్లి పరిధి నడిమితండాకు చెందిన కట్రోత్ గోపాల్(55) తన బంధువుల వివాహానికి శుక్రవారం మోపెడు వాహనంపై నర్సంపల్లి తండాకు వెళ్లాడు. శనివారం సాయంత్రం నర్సంపల్లితండా నుంచి నర్సంపల్లి గ్రామానికి వస్తుండగా.. కిష్టాపూర్ నుంచి నర్సంపల్లి వైపు వస్తున్న హిటాచి జేసీబీ లోడ్‌తో ఉన్న లారీ వెనుకా నుంచి అతి వేగంతో గోపాల్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అతడు లారీ టైర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


లారీ కిందపడి మృతి చెందిన గోపాల్

చెరువులో పడి వ్యక్తి మృతి

చేగుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి)చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. చేగుంట పట్టణానికి చెందిన గోరంట్ల వెంకటేశం(53) గ్రామ శివారులోని ఊర చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుడికి భార్య వజ్రమ్మ, ఇద్దరు కొడుకులు ఉన్నారు.


వెంకటేశం(53)

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పుల్‌కల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి గ్రామ శివారులో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ శనివారం తెల్లవారు జామున సిబ్బందితో కలిసి సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో బొలెరో(టీఎస్15యూఈ 0179)లో అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం అదించగా, వారు పరిశీలించి రేషన్ బియ్యమేనని నిర్ధారించారు. ఆ మేరకు డ్రైవర్‌తో పాటు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

కోహెడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగసముద్రాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చింతలపల్లి జనార్ధన్‌రెడ్డి తన ట్రాక్టర్‌లో మెక్కజొన్నను లోడ్ చేసుకుని సిద్దిపేటలో విక్రయించడానికి శనివారం బయలుదేరారు. మండలంలోని బస్వాపూర్ ఐకేపీ కేంద్రం సమీపంలో హనుమకొండ సిద్దిపేట ప్రధాన రహదారిపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో ట్రాలీ బోల్తా పడింది. ఆ సమయంలో ట్రాలీలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

● హెచ్‌సీయూ ఎస్ఎఫ్ఐ నేత ఎర్ర నవీన్
● కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు నుంచి విడుదల




అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంది, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : అరెస్టులు, జైలు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్‌సీయూ ఎస్ఎఫ్ఐ నేత ఎర్ర నవీన్ అన్నారు. (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ) భూములు వేలం ఆపాలని యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న యూనివర్సిటీ విద్యార్థి సంఘం నేత ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ జాయింట్ సెక్రెటరీ పీహెచ్‌డీ స్కాలర్ ఎర్ర నవీన్ శనివారం ఉదయం కంది సెంట్రల్ జైలు నుంచి విడుదల య్యారు. ఆయనకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శాలువాలు, పూలమాలతో సన్మానించారు. టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేశారు. కందిలో అంబేద్కర్ విగ్రహానికి నవీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్, వ్యాకాస జిల్లా కార్యదర్శి నర్సింహులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఈ కృష్ణ, పి కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్, సహాయ కార్యదర్శి అర్జున్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థి సంఘం నాయకులు దీపక్, అంతేక్, దిలీప్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

అక్షర శిల్పికి అరుదైన పురస్కారం

● తెలుగు జర్నలిస్ట్ సంఘం (ఏపీ) పురస్కారానికి సిద్దిపేట వాసి ఏజాజ్ ఎంపిక



ఎజాజ్ అహ్మద్

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : విద్యా రంగంలో అపూర్వ సేవలందించిన సిద్దిపేటకు చెందిన ప్రముఖ చేతి రాత నిపుణులు, వ్యాఖ్యాత ఎజాజ్ అహ్మద్ విద్య విభాగంలో ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ చేతుల మీదుగా ఈ అవార్డును ఎజాజ్ అహ్మద్ అందుకున్నారు. ఉగాది పురస్కారంలో భాగంగా నగదు, ప్రశంసా ప్రతం, రూ. 20 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందించారు.

అందమైన చేతిరాత పుస్తకానికి అద్భుత ఆదరణ

టిక టిక టిక, టిక, టికొక్కటి.. అంటూ అందమైన చేతి రాతను సులభంగా వ్రాసే మెళకువలు నేర్పే ఎజాజ్ అహ్మద్ వీడియోను యూట్యూబ్‌లో 40 దేశాల్లో 10 కోట్లకు పైగా మంది ఇప్పటికే వీక్షించారు. సులభమైన రీతిలో సున్నాలు, గీతలతో లక్షలమంది చేతి రాతను అందంగా తీర్చిదిద్దారు. పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులకు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో చేతి రాతపై సుమారు 3వేల శిక్షణా తరగతులు నిర్వహించారు. అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే అనే పుస్తకానికి రూపకల్పన చేశారు. ఆ పుస్తకం 150 పునర్ముద్రణలు పొందింది అంటే ఎంత ఆదరణ పొందిందో అర్థం చేసుకోవచ్చు.

ఆకట్టుకుంటున్న మహేశ్ తీసిన చిత్రాలు



ఆర్ట్ గ్యాలరీలో మహేష్ చిత్రాల ప్రదర్శన

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరుగుతున్న చిత్ర ప్రదర్శనలో సిద్దిపేటకు చెందిన సామలేటి మహేష్ తీసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 12నుంచి 14 వరకు మాదాపూర్ తెలంగాణ స్టేట్ ఆర్ట్ గ్యాలరీ శిలానిశ్శబ్దం పేరిట చిత్ర ప్రదర్శన కొనసాగుతుంది. భాష సంస్కృతి శాఖ నేతృత్వంలో కళాయజ్ఞం, టార్చ్ సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టారు. జనవరి 25, 26న ప్రముఖ చిత్రకారుడు ఏలూరి శేషాబ్రహ్మం నేతృత్వంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 60 మంది కళాకారులతో కాకతీయ టెంపుల్ స్కెచ్ స్టడీ టూర్ చేపట్టారు. పలువురు చారిత్రక కట్టడాలను సంబంధించిన చిత్రాలను అక్కడికక్కడే గీశారు. సిద్దిపేటకు చెందిన మహేష్ వరంగల్, పెద్దపల్లి జిల్లాలోని కాకతీయుల కాలం నాటి పలు చిత్రాలను తన కెమెరాలో బంధించారు. ఈ క్రమంలోనే ఆయా వాటిలో ఎంపిక చేసిన చిత్రాలతో ప్రదర్శన చేపట్టారు. అందులో మహేష్ తీసిన రెండు చిత్రాలు ప్రదర్శనకు ఎంపిక అవ్వడం విశేషం. ఈ సందర్భంగా పలువురు కళాభిమానులు సామలేటి మహేష్ ప్రదర్శించిన చిత్రాలను చూసి అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, శేషాబ్రహ్మం, అరవింద్ ఆర్య, శ్రీరామోజు హరగోపాల్, కంది నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

హద్దులు లేవు.. కంచె కరువు

ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు శూన్యం

● మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలపై పలువురి కన్ను
● ప్రహరీ నిర్మాణం, హద్దురాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు



గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ వెనుక గల కంచే, బోర్డు లేని స్థలం

గజ్వేల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో భూమి విలువలు ఆకాశాన్నంటిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గజం భూమి దొరికిన వేలల్లో డబ్బులు దక్కే అవకాశం ఉండడంతో ప్రభుత్వ స్థలాలపై పలువురు కబ్జాదారులు కన్నేశారు. ఈ క్రమంలోనే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో కంచెలు, బోర్డులు లేని ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. గతంలోనూ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమైన విషయం తెలిసిందే. తూప్రాన్ రోడ్డులోని ఓ భూమి ఆక్రమణ విషయంలో అప్పట్లో పెద్ద పంచాయతీ జరగగా, వివాదాస్పద భూమి అధికారుల ఎంట్రీతో ప్రభుత్వ భూమిగా తేలింది. ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ భూముల పక్కన ఇండ్లను నిర్మించుకున్న, భూములను కొనుగోలు చేసినవారు పక్కనే ఉన్న భూమిని ఆక్రమించుకోవడం అలవాటుగా మారిపోయింది. ఈ క్రమంలోనే ప్రభుత్వ, దేవాదాయ, మునిసిపల్, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భూములకు ప్రహరీని ఏర్పాటు చేస్తే వాటి ఆక్రమణలు జరిగే ఆస్కారం ఉండదు.

ఐవోసీ భవనం వెనుక గల భూమిపై పలువురి కన్ను

గజ్వేల్ పట్టణంలోని సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయం(ఐవోసీ) వెనక గల స్థలంపై పలువురు కన్ను వేసినట్లు తెలుస్తోంది. గతంలో ఐవోసీ నిర్మించిన క్రమంలో దాదాపు 20 గుంటల భూమిని వదిలేశారు. ఈ భూమి సంగాపూర్ రోడ్డుతో పాటు హౌసింగ్ బోర్డు-ముట్రాజ్‌పల్లికి వెళ్లే రోడ్డుకు అనుసంధానంగా ఉండడంతో గజం విలువ రూ.30 వేల పైనే ఉంటుంది. సదరు భూమికి బోర్డు, కంచే, ప్రహరీ లాంటివి లేకపోవడంతో అన్యాక్రాంతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా మునిసిపాలిటీ పరిధిలోని ఐవోసీ వెనుక గల కోర్టు పరిధిలో ఉన్న దేవాదాయ శాఖ భూమికి సంబంధించిన హద్దులను దాటి పలువురు ప్రహరీని నిర్మించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మినీ స్టేడియం వద్ద గల భూమిని సైతం పలువురు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీ పరిధిలో రెండు నర్సరీలు, ఎనిమిది పార్కులు, పది చోట్ల మున్సిపల్ స్థలాలు ఉండగా, పలు ప్రభుత్వ కార్యాలయాలను ఐవోసీలోకి మార్చడంతో సదరు స్థలాలు, భవనాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. పలు శాఖలకు సంబంధించిన భూములూ ఉన్నాయి. వీటిపై ఆయా శాఖలతో పాటు మునిసిపల్, రెవెన్యూ అధికారులు చొరవ చూపి ప్రహరీని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రహరీని ఏర్పాటు చేయాలి



గజ్వేల్ పట్టణంలోని ఆయా ప్రభుత్వ స్థలాలు, పార్కులు, నర్సరీలకు సంబంధించిన స్థలాలకు, ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలకు సంబంధించిన స్థలాలకు ప్రహరీని ఏర్పాటు చేయాలి. చాలా చోట్ల కనీసం బోర్డులు లేకపోవడంతో అన్యాక్రాంతం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ అధికారులు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు స్పందించి కంచే లేదా ప్రహరీని ఏర్పాటు చేయాలి.

-సందబోయిన ఎల్లయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

స్థలాలను ఆక్రమిస్తే సహించం



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం. ఎక్కడా ఆక్రమణలకు తావు లేకుండా చాలా చోట్ల ఇప్పటికే కంచె లేదా ప్రహరీని ఏర్పాటు చేశాం. మిగతా చోట్ల ఉన్న వాటికి కంచె లేదా ప్రహరీల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు నడుచుకుంటాం. ప్రభుత్వ స్థలాలను కాపాడుతాం.

-గొల్కొండ నరసయ్య, మునిసిపల్ కమిషనర్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలి
● మెదక్ ఎంపీ రఘునందన్ రావు



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్ రావు

నంగునూరు,ఏప్రిల్ 12: వడగళ్ల వర్షం తో నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నంగునూరు మండలం వెంకటాపూరు, ముండ్రాయి, నర్మెట్ట, మైసంపల్లి, పాలమాకుల, రాజగోపాల్ పేట గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన రైతులను ఓదార్చి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రైతులకు రుణ మాఫీ చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొండి పంచాయితీ పెట్టిందన్నారు. వర్షంతో ఎక్కువ శాతం నష్టం నంగునూరు మండలంలోనే జరిగిందని తెలిపారు. కౌల్ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సర్వే చేసి నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల రాష్ట్ర మంత్రులు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కోసమే మండలంలో పర్యటించారు తప్ప రైతుల కోసం కాదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులనుద్దేశించి వరికి బదులు తాలు పండిస్తున్నారా అని అంటూ ఎగతాళి చేసి మాట్లాడడం సరికాదన్నారు. రాళ్ల వర్షం వస్తే వడ్లు రాలి తాలు మాత్రమే మిగులుతుందన్న విషయం మంత్రులు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, యాదమల్లు, రజనీకర్ రెడ్డి నాంపల్లి శ్రీనివాస్, నారాయణ, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్, కృష్ణ, సురేందర్ రెడ్డి, జ్యోతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నిర్మూలన అందరి సామాజిక బాధ్యత అని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అవగాహన పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల సమాజంలో యువశక్తి విచ్ఛిన్నమవుతుందన్నారు. పోలీసు శాఖ డ్రగ్స్ నిర్మూలకను పని చేస్తోందని, పౌరులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం, రవాణ, సరఫరా చేయడం తీవ్రమైన నేరమని, వారి శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో తూప్రాన్ బాలుడి సత్తా



గ్రాండ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను అందుకుంటున్న జై సాయి దీక్షిత్

మనోహరాబాద్ ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ బాలుడికి దక్షిణ భారత్ ఓపెన్ కరాటేలో చాంపియన్‌షిప్‌లో పోటీలలో టైటిల్ కైవసం చేసుకున్నాడు. షోలీన్ కరాటే ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం కండ్లకోయలోని నిమ్మల కన్వెన్షన్ హల్‌లో దక్షిణ భారత్ ఓపెన్ కరాటే కుంగ్ ఫు చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో భాగంగా 11 ఏళ్లలోపే కేటగిరీలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పోటీదారుల మధ్య జరిగిన పోటీలలో తూప్రాన్‌కు చెందిన జై సాయి దీక్షిత్ గ్రాండ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. దీక్షిత్ జ్ఞాని షోటోకాన్ అకాడమీ ద్వారా శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్లు కాశినాథ్, రంగు గణేష్ గౌడ్‌లకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయం తూప్రాన్‌కు చెందిన క్రీడాకారుల మధ్య ప్రేరణగా నిలుస్తుందని అన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించిన అజయ్‌కుమార్



విజేతగా నిలిచిన అజయ్‌కుమార్

సంగారెడ్డి రూరల్, ఏప్రీల్ 12 (ఆంధ్రజ్యోతి) : నేపాల్ దేశంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయిలో శనివారం నిర్వహించిన పోటీల్లో అజయ్ కుమార్ తన సత్తా చాటాడు. ఈ పోటీల్లో ఇండియా, బుటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా సంగారెడ్డికి చెందిన యోగా గురువు అజయ్‌కుమార్ 35 ప్లస్ క్యాటగిరిలో అథ్లెటిక్స్ పురుష విభాగంలో 60, 100, 200 మీటర్లు, యోగాలో 4 బంగారు పథకాలు సాధించారు. 60 మీటర్ల పరుగు పందెంలో 6.25 సెకండ్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డుని నెలకొల్పారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ సంగారెడ్డి కలెక్టరేట్ వెనుక భాగంలో ఉన్న పార్కులో ఈ నెల 15వ తేది నుంచి అన్ని వయస్సుల వారికి శిక్షణ అందించి ప్రోత్సహిస్తానన్నారు.



అట్టహాసంగా రావణ దహనం

● జోగిపేటలో వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

జోగిపేట. ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): జోగినాథ స్వామి ఉత్సవాలలో చివరిది, ఉత్సవాలకే తలమానికమైన రావణ దహనం శుక్రవారం అర్థరాత్రి నేత్రపర్వంగా జరిగింది. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో వేదిక వద్ద తూర్పు అభిముఖంగా సుమారు 40 అడుగుల ఎత్తుతో పదితలలతో కూడిన రావణుడి భారీ ఆకారాన్ని రూపొందించారు. దీనితోపాటు అదే ఆవరణలో 3 చెట్లు పడగెత్తిన 3 భారీ నాగుపాము ఆకారాలను ఏర్పాటు చేశారు. రావణుడు తదితర ప్రతిమలలో భారీ టపాసులను, మందుగుండు సామాగ్రిని కూర్చారు. సోమవారం రాత్రి 1 గంట సమయంలో ఆనవాయితీ ప్రకారం జోగినాథ స్వామికి ఆలయ పూజారి భద్రయ్యస్వామి, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డాకూరి శివశంకర్,సభ్యులు ఎస్. క్రిష్టారెడ్డి, ఎస్. సురేందర్ గౌడ్, పీ. శివశేఖర్‌లచే ప్రత్యేక హారతి నిప్పటించారు. అనంతరం, రావణాసురుడి విగ్రహం వద్ద శివుడి చిత్రపటానికి ఆలయ కమిటీ సభ్యులచే ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం, మొదటగా చెట్లు, నాగుపాము ఆకారాలను పేల్చారు. వివిధరంగులతో కూడిన కాంతులను వెదజల్లుతూ అవి వెలిగి చూపరులను విపరీతంగా ఆకట్టుకున్నాయి.ఈఉత్సవాలకు మొదటగా, నిర్వహించిన సంగీత విభావరి ఆహూతులను అలరించింది. జోగిపేట సీఐ అనిల్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పుల్కల్, వట్‌పల్లి స్టేషన్ల సిబ్బంది, ప్రత్యేక పోలీసులు బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేశారు.



జోగిపేటలో హాజరైన జనం

పాలిటెక్నిక్.. విద్యార్థుల భవితకు బంగారు బాట

● కోర్సు పూర్తిచేయగానే ఉద్యోగాలు లభించే అవకాశం
● దరఖాస్తుకు 19 వరకు గడువు



సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువు ఒక్క ఎత్తయితే ఉన్నత చదువులకు వెళ్లాలంటే పదిలో ఉత్తీర్ణులవ్వాల్సిందే. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆ తరువాత ఉన్నత చదువులకు వెళ్లాలంటే ఎలాంటి కోర్సులు తీసుకోవాలి, ఏ విద్యాసంస్థలో చేరాలంటూ మదనపడుతుంటారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు ఉన్నతమైనదని చెప్పవచ్చు. కేరీర్ పరంగా జీవితంలో త్వరగా స్థిరపడాలకునే వారు పాలిటెక్నిక్‌లో చేరితే డిప్లొమా త్వరగా పూర్తి చేయవచ్చు. ఇంజనీరింగ్ పూర్తి చేయాలంటే ఇంటర్‌లో రెండు సంవత్సరాలు డిగ్రీలో నాలుగు సంవత్సరాల పాటు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్‌లో మూడేళ్లు చేయాలి. కానీ పాలిటెక్నిక్‌లో అలా కాదు మూడేళ్లలో ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తి చేయవచ్చు. పాలిటెక్నిక్‌లో కంప్యూటర్స్ ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ ఇంజనీర్, సివిల్ ఇంజనీర్ లాంటి కోర్సుల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సులు ఉన్నాయి. ఇవి పూర్తి చేసిన విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవచ్చు. అంతేకాకుండా ప్రైవేటు రంగాల్లో కూడా మెండుగా ఉద్యోగాలు లభిస్తాయి. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఈసెట్ ద్వారా నేరుగా ఇంజనీరింగ్ రెండవ సంవత్సరంలో చేరి మూడు సంవత్సరాల్లో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసే అవకాశం ఉంటుంది.

ప్రవేశాలు ఇలా..

పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశాలు పొందేందుకు అర్హులు. పాలిటెక్నిక్‌లో విద్యార్థుల ప్రవేశాలకు రాష్ట్రంలో ఉన్న అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక శిక్షణ సంస్థ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తుంది. పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 19వ తేది వరకు (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పాలిసెట్.సబ్‌టెట్.తెలంగాణ.గో.ఇన్) అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఎస్సీ ఎస్టీ కేటగిరీలకు చెందిన విద్యార్థులు రూ.250 ఫీజు ఉండగా ఇతర వర్గాల విద్యార్థులు రూ.500 ఫీజు చెల్లించాలి.

పదో తరగతి తరువాత పాలిటెక్నిక్ ఉత్తమం



పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్మీడియేట్‌తో పోల్చితే పాలిటెక్నిక్ ఎంతో ఉత్తమం. అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉంటుంది. డిప్లొమా అనంతరం ఈసెట్ ద్వారా మంచి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం పొందవచ్చు. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయి.

-జానకిదేవి, ప్రిన్సిపాల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సంగారెడ్డి

ఘనంగా హనుమాన్ జయంతి



నారాయణఖేడ్ మండలం కొండాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ బీబీపాటిల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



పటాన్‌చెరులో హనుమాన్ శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో ఎమ్మెల్యే మాణిక్‌రావు



మెదక్ అర్బన్: ప్రత్యేక అలంకరణలో పంచముఖి అంజనేయస్వామి

హనుమాన్ జయంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పలు మండలాల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



నర్సాపూర్: హనుమాన్ శోభాయాత్రలో ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు



పుల్కల్ మండలం చౌటకూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న యువకులు



సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, హిందూ సోదరులు



పెద్దశంకరంపేట పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



పాపన్నపేట మండలం కుర్తివాడలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి బీబీపాటిల్ పరామర్శ

నారాయణఖేడ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న బీజేపీ నారాయణఖేడ్ నాయకుడు సంజీవ్ పటేల్‌ను జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ శనివారం పరామర్శించారు. ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని, అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు. ఎంపీ వెంట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, సాయిరాం, అరుణ్‌రాజ్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

చిలప్‌చెడ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్రను నిర్వహించారు. మండలం పరిధిలోని ఫైజాబాద్ గ్రామం నుంచి అజ్జమర్రి వరకు పాదయాత్ర కొనసాగించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, వినతిపత్రం అందజేశారు. నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గ్రథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

నారాయణఖేడ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఈ మధ్య ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన ప్రతిభ పరీక్షలో ఖేడ్ బోధి పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న కే.అవంతి 6వ ర్యాంకు, ప్రిన్సి 21వ ర్యాంకులను సాధించి, పతకం అందుకున్నారు. శనివారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అల్లాదుర్గం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13న అల్లాదుర్గం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో అల్లాదుర్గం ఇన్‌చార్జి ఏఈ నవాజ్ శనివారం తెలిపారు. చిల్వర్, ముప్పారం, కుసంబినగర్, మాందాపూర్, అల్లాదుర్గం గ్రామాల్లో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నేడు నియోజకవర్గ వ్యాప్తంగా కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, రాయికోడ్, జహీరాబాద్ మండలం, పట్టణంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్‌శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

రాయిలాపూర్‌లో రథోత్సవం

రామాయంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాయిలాపూర్‌లో రథోత్సవం వైభవంగా సాగింది. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇప్పటికే పొన్న సేవ, గరుడ సేవ తదితర వాటిని అట్టహాసంగా నిర్వహించారు. చివరగా రథోత్సవంతో వేడుకలకు ముగింపు పలికారు.

అంబేడ్కర్ విగ్రహానికి మరమ్మతులు

నర్సాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్‌లోని చిల్డ్రన్స్ పార్కులో నిరాదరణకు గురై కొద్దిపాటిగా దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహానికి శ్రీపాద ట్రస్టు చైర్మన్ పైడి శ్రీధర్‌గుప్తా మరమ్మతు చేయించారు. జాతీయ రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన అంబేడ్కర్ విగ్రహంతో పాటు ఇతర నేతల విగ్రహాలను 14న అంబేడ్కర్ జయంతికి వచ్చే నాయకులు అనువైన చోట ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అక్కమహాదేవి జయంతి

జహీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జగజ్యోతి, తత్వశిఖామణి అక్కమహాదేవి 885వ జయంతిని శనివారం జహీరాబాద్ పట్టణంలోని అక్కన బళగ లింగాయత్ సమాజ్ నాయకుల సమక్షంలో నిర్వహించారు. అందులో భాగంగా అనుభవ మండపంలో అక్కమహాదేవికి మహిళలు డోలారోహణం నిర్వహించారు. లింగాయత్ సమాజ్ నాయకులు అక్కమహాదేవి చరిత్ర, జీవనశైలి గురించి వివరించారు.

జీతాలు ఇప్పించండి

చేగుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పారిశుధ్య కార్మికులు శనివారం వడియారం గ్రామంలోని గాంధీ చౌరస్తా వద్ద భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

కొండాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండలం అనంతసాగర్‌లోని కోనేటిరాయుడి ఆలయంలో వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వెంకటేశం స్వామివారికి వెండి కిరీటాన్ని బహూకరించారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేపట్టారు.

సన్నబియ్యంతో నిరుపేదలకు ప్రయోజనం

● ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

జహీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సన్నబియ్యంతో నిరుపేదలకు ప్రయోజనం ఉంటుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, మాజీమంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేస్తూ సుభిక్షమైన పాలనను కాంగ్రెస్ అందిస్తుందని కొనియాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మఇళ్లు, రాజీవ్ యువవికాస్, ఉచిత విద్యుత్, వంటగ్యాస్ సబ్సిడీ, సన్నబియ్యం పంపిణీ, రైతులకు రూ.300 బోనస్ తదితరాలతో మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంబేడ్కర్‌ను, ఆయన రచించిన రాజ్యాంగాన్ని కేంద్రమంత్రి అమిత్‌షా విమర్శించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, పట్టణ అధ్యక్షులు నర్సింలు, మహిళా అధ్యక్షురాలు అస్మాతబస్సుం, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్‌షెట్కార్, వివేక్‌వెంకటస్వామి

సన్నబియ్యంతో పేదలు సంతోషం

నర్సాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పట్ల పేదలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్‌నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని జగన్నథరావు కాలనీలో ఓ ముస్లిం కుటుంబం ఇంట్లో సన్నబియ్యంతో చేసిన భోజనాన్ని కుటుంబీకులతో కలిసి తిన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షుడు డి.అంజిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అధికారంలోకి మళ్లీ వస్తాం: ఎమ్మెల్యే

కోహీర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని, తప్పకుండా రాబోయేరోజుల్లో మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని జహీరాబాద్ ఎమ్మెల్యే కే.మాణిక్‌రావు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈనెల 27వ తేదీ వరంగల్ జిల్లా ఎల్కతుర్తి గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రజతోత్సవానికి సంబంధించి శనివారం కోహీర్ మండలంలోని కవేల్లి చౌరస్తా వద్ద నిర్వహించిన సన్నాక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మన పార్టీ అధికారంలో లేదని కార్యకర్తలు అధైర్య పడరాదన్నారు. రాబోయే రోజుల్లో తప్పకుండా మనమే అధికారంలోకి వచ్చి ప్రజా సమస్యలను, కార్యకర్తల సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ వివిధ మండలాల అధ్యక్షులు నర్సింలు, నారాయణ, వెంకటేశం, మోహీయోద్దీన్, సంజీవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : హన్మంతరావు

నిజాంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గాయత్రీమాత 33 ఆలయ వార్షికోత్సవానికి శనివారం ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని, రైతులు పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రపాల్, కాంగ్రెస్ నాయకులు సుప్రభాతరావ్, ముత్యంరెడ్డి, మహేందర్, నసీరోద్దీన్, రమేష్, కాకి రాజయ్య పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

వెంకటరమణకు సీఎం అభినందన



వెంకటరమణను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

జహీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూప్-1ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన అధ్యాపకుడు నల్గొండ జిల్లాకు చెందిన దాది వెంకటరమణ శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం వెంకటరమణను శాలువాతో సన్మానించారు. వెంకటరమణ ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇటికాల సాత్విక్‌రెడ్డి, అకిల్‌రెడ్డి, వాసుదేవ్, సీనియర్ జర్నలిస్టు ఇటికాల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ పండుగలను ప్రోత్సహించాలి: మాధవానందస్వామి



రేగోడులో హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీ బీబీ పాటిల్

రేగోడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పండుగలను ప్రోత్సహించాలని తొగుట పీఠాధిపతి మాధవానంద స్వామి అన్నారు. శనివారం రేగోడు హనుమాన్ ఆలయంలో వినాయక, శివలింగం, బసవన్న, నాగదేవతల, భైరవుని విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా మాధవానంద స్వామి, భూమయ్యస్వామి హిందూ ధర్మం గురించి ప్రవచనాలు చేశారు. ఈ మహోత్సవానికి మాజీ ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ అందోల్ ఇన్‌చార్జి జగదీశ్వర్, శంకర్, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భిక్షపతి వేర్వేరుగా హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దిగంబరావ్, పోలీస్ క్రిష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండరామస్వామి గరుడ సేవ

శివ్వంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శివ్వంపేటలోని కాకతీయుల కాలం నాటి పురాతన దేవాలయం కోదండరామస్వామి ఆలయంలో జాతర సందర్భంగా శనివారం వేద పండితులు, గ్రామ పురోహితులు శాస్త్రుల వామన్ శర్మ ఆధ్వర్యంలో గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. పుర వీధుల్లో నిర్వహించిన గరుడ సేవకు మహిళలు పెద్ద సంఖ్యలో మంగళహారతులతో స్వాగతం పలికారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

శివ్వంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని పీసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన శివ్వంపేటలోని కాంగ్రెస్ నాయకులు నవీన్‌గుప్తా గృహంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.9.15 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌వేణుగోపాల్‌రెడ్డి, గణేష్, దావూద్‌అలీ, పలు గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న రాజిరెడ్డి

జహీరాబాద్ పార్లమెంట్ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జిగా శుక్లవర్ధన్‌రెడ్డి

జహీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పార్లమెంట్ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జిగా పట్టణంలోని పస్తాపూర్‌కు చెందిన జీ.శుక్లవర్ధన్‌రెడ్డిని నియమిస్తూ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, మాజీ మంత్రి డా.చంద్రశేఖర్ నియామాకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ అభివృద్ధి కోసం చురుకుగా పనిచేసిన శుక్లవర్ధన్‌రెడ్డి సేవలను గుర్తించి నియమించామన్నారు. అనంతరం శుక్లవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ.. అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మాతబస్సుం, నాయకులు బాస్కర్‌రెడ్డి, సాయిలు, షౌకత్‌అలీ, అర్షద్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శుక్లవర్ధన్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

ఐదురోజులపాటు కోహీర్ రైల్వే గేటు మూసివేత

కోహీర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కోహీర్-కావేలి మార్గమధ్యలో గల కోహీర్ సమీపంలోని 24వ రైల్వే గేటు వద్ద అత్యవసర పనుల నిమిత్తం ఐదురోజుల పాటు గేటు మూసేస్తున్నామని రైల్వే అధికారులు తెలిపారు. 13వ తేదీ ఉదయం 6 నుంచి 17వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఈ రైల్వే గేటును మూసేస్తామన్నారు. ప్రయాణికులు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని వెళ్లాలని సూచించారు.

వనదుర్గామాత సన్నిధిలో ఆర్డీవో

పాపన్నపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఏడుపాయల వనదుర్గామాతను మెదక్ ఆర్డీవో కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. శనివారం అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆర్డీవో రమాదేవి కుటుంబసభ్యులకు ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు.

బగలాముఖి ఆలయంలో మహామంత్ర హవనం

శివ్వంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన దశ మహా విద్యలో ఒకటైన శక్తి పీఠం బగలాముఖి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం శేష పూజలు, యాగశాలలో మహా మంత్రావనం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం

శివ్వంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రాణపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి సీపీఆర్ నిర్వహించి ప్రాణం రక్షించిన కానిస్టేబుళ్లను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. దేవమ్మగూడెం తండాకు చెందిన రాజు(30) రెండురోజుల క్రితం కుటుంబీకులతో గొడవపడి ఇంట్లో ఉరేసుకున్నాడు. 100కి కాల్ చేయడంతో స్పందించిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్, మహేందర్‌నాయక్ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రాజుకు సీపీఆర్ చేసి ప్రాణం పోశారు. దీంతో కానిస్టేబుళ్లను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తా పోలీస్‌స్టేషన్‌లో సన్మానించి, రూ.5 వేల నగదు ప్రోత్సాహం అందజేశారు. అదేవిధంగా ఎస్ఐ మధుకర్‌రెడ్డి కూడా సన్మానించారు.

మత్తడి పోచమ్మకు బండ్ల ఊరేగింపు

పాపన్నపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పాపన్నపేట మండలం కుర్తివాడలో ధవళ పౌర్ణమి పురస్కరించుకుని మత్తడి పోచమ్మ జాతర శనివారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఎడ్లబండ్లను ఊరేగించారు. జాతరకు మిన్‌పూర్, దౌలాపూర్, యూసుఫ్‌పేట్ చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. నేడు అమ్మవారికి బోనాలు సమర్పించడం, ఎల్లుండి రథోత్సవంతో జాతర ముగుస్తుంది.

67వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు వద్దంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 67వ రోజుకు చేరాయి. శనివారం దీక్షలో దోమడుగు గ్రామ ప్రముఖులు అభిశెట్టి రాజశేఖర్, మద్దిబాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కడాలి మురళి, మంగయ్య, శేఖర్, యాదగిరి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా జేఏసీ మండల కన్వీనర్ చిమ్ముల జైపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మద్దుల బాల్‌రెడ్డి, సదానందరెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువు నీళ్లతో పంటలకు నష్టం

వెల్దుర్తి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రామ శివారులో ఉన్న దేవతల చెరువు నుంచి నీటిని విడుదల చేయడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి వరిని సాగు చేశామని, పంట కోతకు వచ్చిన సమయంలో చెరువు నుంచి నీటిని విడుదల చేయడంతో పొలాల్లోకి నీరు భారీగా చేరిందని, దీంతో కోతలు కోసేందుకు ఇబ్బందులవుతున్నాయన్నారు. అలాగే ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటిని ఆపివేయాలని రైతులు కోరుతున్నారు.

తరుగు పేరిట రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

కల్హేర్/నారాయణఖేడ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో రైతులు పండించిన ధాన్యం, జొన్నల కొనుగోలులో కేంద్రాల నిర్వహకులు గానీ, రైస్ మిల్లర్లు గానీ తరుగు పేరిట వారిని దోపిడీకి గురిచేస్తే చర్యలు తప్పవని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పీ.సంజీవరెడ్డి హెచ్చరించారు. సిర్గాపూర్ మండలంలోని కడ్పల్‌లో జొన్నలు, ధాన్యం, సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నాగ్‌దర్, బాచేపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో తరుగు పేరిట రైతులను దోచుకున్నారని, రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. సంగారెడ్డి జిల్లాలోనే మొట్టమొదటి జొన్నల కొనుగోలు కేంద్రం నేడు కడ్పల్‌లో ప్రారంభించామని తెలిపారు. అనంతరం సిర్గాపూర్ మండం కడ్పల్ గ్రామంలో సన్నబియ్యం లబ్ధిదారుడు బుగుడాల అంజమ్మ, రాములు గృహంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి నాయకులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిర్గాపూర్, నిజాంపేట మండలాధ్యక్షులు మనీష్‌పాటిల్, శంకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు పట్లోళ్ల సంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్ మండలం సంజీవన్ రావుపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



నిజాంపేట: నాగ్‌ధర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి